సాక్షి
వైఎస్సార్‌ జిల్లా

గురువారం । 22 । జూన్‌ । 2023



నీరు పుష్కలం.. పెరిగిన భూగర్భజలం

సర్వరాయసాగర్‌ ప్రాజెక్టులో నాలుగేళ్లుగా నీటిని నిలువ ఉంచుతుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. - 8లో



గాలివాన బీభత్సం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. - 8లో



పెప్సీగోడౌన్‌పై ఆకతాయిల దాడి

కడపలోని కొండాయపల్లె సమీపంలో ఉన్న పెప్సీగోడౌన్‌పై కొందరు ఆకతాయిలు కర్రలతో దాడి చేశారు. - 8లో

న్యూస్‌రీల్‌

రిమ్స్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌గా డాక్టర్‌ శ్రీనివాసనాయక్‌



కడప అర్బన్‌: కడప ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌గా డాక్టర్‌ ఎం. శ్రీనివాస నాయక్‌ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో వైస్‌ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్‌ లక్ష్మీబాయి ఇటీవల కర్నూలు మెడికల్‌ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రస్తుతం కడప ఫోరెన్సిక్‌ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసనాయక్‌ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌ వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో కొత్తకోర్సు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ స్పెషల్‌ ఇంగ్లీషు కోర్సు నూతనంగా ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.సుబ్బలక్షుమ్మ తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల్లో భాగంగా రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇంటర్మీడియట్‌ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌ ద్వారి రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్‌

రాజంపేట: రాజంపేట మండలం నారమరాజుపల్లె వద్ద ఉన్న జవహర్‌నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ విడుదలైంది. ఈమేరకు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్‌ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-2024వ సంవత్సరంలో అన్నమయ్య, వైఎస్సార్‌ జిల్లాలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసేందుకు ఆగస్టు 10 వరకు గడువు ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌వీఓడీఏవైఏ.జీఓవీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

నేడు 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌

కడప ఎడ్యుకేషన్‌: ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లాలో నియమితులైన డీఎస్సీ1998, 2008 ఎంటీఎఫ్‌ ఉపాధ్యాయులకు గురువారం కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కడప డీఈఓ కార్యాలయానికి ఉపాధ్యాయులంతా తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

'యువ ఉత్సవ్‌' వాయిదా

కడప స్పోర్ట్స్‌: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 22న ప్రొద్దుటూరులోని సీబీఐటీ కళాశాలలో నిర్వహించాల్సిన 'యువ ఉత్సవ్‌' కార్యక్రమం వాయిదా వేసినట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ తెలిపారు. యువ ఉత్సవ్‌లో భాగంగా పంచ్‌ ప్రాణ్‌ ఆఫ్‌ అమ్రిత్‌ కాల్‌ అన్న అంశంపై నిర్వహించాల్సిన పెయింటింగ్‌, కవిత్వం, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక కార్యక్రమాలను వాయిదా వేసినట్లు తెలిపారు. త్వరలోనే నిర్వహించే తేదీని వెల్లడిస్తామని ప్రకటించారు.

25న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్‌ ఎంపికలు

కడప స్పోర్ట్స్‌: ప్రొద్దుటూరు పట్టణం జార్జ్‌క్లబ్‌లో ఈనెల 25వ తేదీన జిల్లాస్థాయి సబ్‌ జూనియర్‌ (అండర్‌-11, 13) బ్యాడ్మింటన్‌ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఛైర్మన్‌ ఎస్‌. జిలానీబాషా, అధ్యక్షుడు డాక్టర్‌ సింగం భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఎంట్రీలను ఈనెల 24 లోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440223908, 7013356525 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా ఉద్యోగుల బదిలీలు

కడప రూరల్‌: కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్‌-4 పరిధిలో నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రెండవరోజు బుధవారం పీహెచ్‌ఎన్‌ (ఎన్‌టీ), ఎంపీహెచ్‌ఎస్‌ (ఎఫ్‌), ఎంపీహెచ్‌ఎస్‌ (ఎం) ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఈ బదిలీల ప్రక్రియ గురువారంతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ భక్తవత్సల, సూపరింటెండెంట్‌ గోపాల్‌రెడ్డి, సీనియర్‌ అసిస్టెంట్లు అతావుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి పోషణ.. బిడ్డకు రక్షణ

- వైఎస్సార్‌ సంపూర్ణ పోషణతో మహిళల ఆరోగ్యానికి పెద్దపీట
- జులై 1 నుంచి అమలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇళ్లకే పౌష్టికాహారం
- రెండు విడతల్లో పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో 2389 అంగన్వాడీ కేంద్రాలు
- వాటి పరిధిలో 14,239 మంది బాలింతలు, 14,888 మంది గర్భిణులు



వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ కిట్లను అందుకుంటున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులు (ఫైల్‌)



వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ మెను

కడప కోటిరెడ్డిసర్కిల్‌: మాతా శిశు సంరక్షణపై ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ, జగనన్న కిట్ల రూపంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారించేలా వైద్య సేవలతోపాటు పౌష్టికాహారాన్ని సమకూర్చుతోంది. అలాగే వారి ఆరోగ్యానికి భరోసా కూడా కల్పిస్తోంది. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల ద్వారా రుచికరమైన ఆహారాన్ని వడ్డిస్తున్నారు. కొందరికి అంగన్వాడీ కేంద్రాలు దూరంగా ఉండడం, రాకపోకలకు బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతుండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. వారి వినతి మేరకు లబ్ధిదారుల సంక్షేమమే ధ్యేయంగా భావించి జులై 1వ తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అంగన్వాడీ కేంద్రాల్లో వండిన ఆహారానికి బదులుగా టేక్‌ హోం రేషన్‌ (టీహెచ్‌ఆర్‌) ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై బాలింతలు, గర్భిణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతమందికి ప్రయోజనం

జిల్లాలోని 13 ఐసీడీఎస్‌ ప్రాజెక్టుల్లో 2389 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 14,888 మంది, బాలింతలు 14,239 మంది, చిన్నారులు 1,57,015 మంది ఉన్నారు. వీళ్లందరికీ ఇళ్ల వద్దకే రేషన్‌ను అందజేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై గర్భిణులు, బాలింతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరుకుల పంపిణీ ఇలా

అంగన్వాడీ కేంద్రాల పరిధిలో నమోదైన గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహార సరుకులను ఇంటికే సరఫరా చేస్తారు. నెలకు మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో నూనె, 25 కోడిగుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో జొన్నపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల ఎండు కర్జూరం, పావుకిలో బెల్లం, 250 గ్రాముల చిక్కీలు జగనన్న కిట్ల ద్వారా పంపిణీ చేస్తారు. ఏడు నెలల నుంచి 36 నెలల్లోపు చిన్నారులకు నెలకు 2.5 లీటర్ల పాలు, 2.5 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లను ఇంటి వద్దకే ఇస్తారు. అలాగే ప్రీ స్కూలు పిల్లలకు రోజూ కేంద్రాల్లో 100 ఎంఎల్‌ పాలు, కోడిగుడ్లు ఇస్తారు.

దూరం భారమై

జిల్లాలోని కొన్ని అంగన్వాడీ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉండడంతో గర్భిణులు, బాలింతలు మధ్యాహ్న సమయంలో అంగన్వాడీ కేంద్రాలకు రాలేకపోతున్నారు. ఈ విషయం అంగన్వాడీ అధికారులకు తెలియజేయడంతో జులై 1వ తేదీ నుంచి పౌష్టికాహారాన్ని వారి ఇంటి వద్దకే పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నిర్ణయంపై ఒకవైపు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళల్లో రక్తహీనత తగ్గించడం, వ్యాధి నిరోధకశక్తి పెంచేందుకు వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే ప్రతినెల అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు హెచ్‌బీ పరీక్ష చేసి రక్తహీనత ఉన్న వారిని గుర్తిస్తున్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు హోం విజిట్‌ ద్వారా తల్లీపిల్లల ఆరోగ్యం తెలుసుకుని హెల్త్‌ వర్కర్‌ ద్వారా ఐరన్‌, క్యాల్షియం మాత్రమే అందించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు



అంగన్వాడీ కేంద్రాల్లో వండిన ఆహారాన్ని అందించేవారు. కేంద్రానికి అర కిలోమీటరు పైబడి దూరంలో ఉన్న గర్భిణులు, బాలింతలు రావడానికి ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో కేంద్రాలకు రావడం కష్టంగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ఇంటికే సరుకులు అందించడం సంతోషంగా ఉంది. మా బాధను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
– హిందూజ, ఎర్రముక్కపల్లె, కడప

రెండు విడతల్లో అందజేస్తాం



అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్సార్‌ సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం వండి పెడుతున్న ఆహారానికి బదులుగా టీహెచ్‌ఆర్‌ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జులై 1 నుంచి ఇది అమలవుతుంది. 1 నుంచి 5వ తేదీ వరకు మొదటి విడతగా, 16, 17 తేదీల్లో రెండవ విడతగా సరుకులను అందజేస్తాం. – శ్రీలక్ష్మి, ఐసీడీఎస్‌ పీడీ, కడప

ప్రమాద రహిత డ్రైవింగ్‌ చేయాలి

- జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు విధినిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఇంధన పొదుపుతోపాటు ప్రమాద రహిత డ్రైవింగ్‌ చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడపలోని ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో డ్రైవర్లకు ఆయా అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రధానంగా డ్రైవర్ల పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. చిన్నచిన్న మెలకువలు పాటించడం ద్వారా ఇంధనాన్ని పొదుపు చేయవచ్చన్నారు. డ్రైవర్లు ఇంధన పొదుపు చేస్తే సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్లుందన్నారు. ఈ విషయంగా డ్రైవర్లు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత కూడా డ్రైవర్లపై ఉందన్నారు. జిల్లాలోని వివిధ డిపోలలో ఉన్న ప్రమాద రహిత డ్రైవర్ల పనితీరును ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా మాస్టర్‌ ఓబయ్య, ఓం శాంతి సంస్థ ప్రతినిధులు డ్రైవర్లకు యోగా ప్రాధాన్యత, క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం ద్వారా లభించే మానసిక ప్రశాంతత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్‌, సీపీఎం రాజా గజలక్ష్మి, కడప డిపో మేనేజర్‌ డిల్లీశ్వరరావుతోపాటు పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంపై ముఖ్యమంత్రి మమకారం

- కేఎంసీ తాగునీటి అవసరాలకు బ్రహ్మంసాగర్‌లో 1.50 టీఎంసీల కేటాయింపు
- ఈ మేరకు గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల
- కడప నగరంలో తాగునీటి సమస్యకు లభించనున్న శాశ్వత పరిష్కారం

కడప కార్పొరేషన్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కేంద్రం కడప నగరంపై మరోసారి మమకారాన్ని చాటుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా కడప నగర తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి రిజర్వాయర్‌లో 1.50 టీఎంసీల నీటి కేటాయింపులు చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శశిభూషణ్‌ కుమార్‌ గెజిట్‌ నోటిఫికేషన్‌ జారీ చేశారు. అమృత్‌ రెండో దశ పనుల్లో భాగంగా బ్రహ్మసాగర్‌ జలాలను పైపులైన్‌ ద్వారా కడప మున్సిపల్‌ కార్పొరేషన్‌కు తీసుకురానున్నారు.

గతంలో ఇలా....

గతంలో వేసవికాలం వచ్చినప్పుడల్లా పెన్నానది ఎండిపోతే కడప నగరవాసులు తీవ్ర దాహార్తిని ఎదుర్కొనేవారు. అప్పుడు మైలవరంలో నీరు లేకపోతే ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాలను, అధికారులను అడుక్కుని కర్నూల్‌ జిల్లాలోని అలగనూరు బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ ద్వారా పెన్నానదికి నీటిని విడుదల చేయించేవారు. దానివల్ల తాత్కాలికంగా ఉపశమనం లభించేదే తప్పా సమస్య శాశ్వతంగా పరిష్కారం కాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-2019 మధ్య కాలంలో పెన్నానదిపై లింగంపల్లి వద్ద రూ.72కోట్లతో సబ్‌ సర్ఫేజ్‌ డ్యామ్‌ నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో శంకుస్థాపన చేయించారు. కానీ టెండర్లు కూడా పూర్తి చేయించలేకపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు ఉండటం చేత మైలవరం జలాశయం నుంచే పెన్నాకు నీటిని విడుదల చేయిస్తూ వచ్చారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ కె. సురేష్‌బాబులు పదే పదే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడం, సీఎం సానుకూలంగా స్పందించి నీటి కేటాయింపులు చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో 1.50 టీఎంసీల నీళ్లు హక్కుగా రానున్నాయి.

కడప కార్పొరేషన్‌కు రూ.45.59 కోట్లు విడుదల

కడప మున్సిపల్‌ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల కోసం రూ.45.59కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి గుల్జార్‌ ఉత్తర్వులు జారీ చేశారు. కడప నగరంలో రహదారుల విస్తరణ వల్ల నష్టపోయే వారికి నష్ట పరిహారం ఇవ్వాలంటే మొత్తం రూ.85.59కోట్లు అవసరం కాగా, ఇందులో రూ.40 కోట్లను ఇదివరకే ప్రభుత్వం విడుదల చేసింది. దాన్ని అధికారులు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోయేవారికి అందజేశారు. ఈ మేరకు అంబేడ్కర్‌ సర్కిల్‌- వై జంక్షన్‌ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పుడు విడుదలైన రూ.45.59 కోట్లతో గోకుల్‌ సర్కిల్‌-అన్నమయ్య సర్కిల్‌, దేవునికడప రోడ్డులో విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోయేవారికి నష్ట పరిహారం కింద అందజేయనున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలు, వృద్ధులకు సేవలు

కలెక్టర్‌ విజయరామరాజు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్‌: అంగన్వాడీ కేంద్రాల్లో కేవలం బాలింతలకు, గర్భిణులు, చిన్నారులకు మాత్రమే కాకుండా మహిళలు, వృద్ధులకు కూడా సేవలు అందించాలని కలెక్టర్‌ విజయరామరాజు చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్‌ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, వృద్ధులకు సరైన పౌష్టికాహారం, ప్రణాళిక ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మహిళలు, బాలికలకు రక్తహీనత సమస్యలు రాకుండా వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలన్నారు. సూపర్‌వైజర్లు అంగన్వాడీ సిబ్బందితో వాట్సాప్‌ గ్రూపులు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు.

ఆధార్‌ సీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందినప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఐసీడీఎస్‌ ఉద్యోగి బాధ్యతగా పనిచేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికలు, గర్భిణులకు ప్రతినెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎప్పుడు ఎలాంటి వ్యాక్సిన్‌ వేయించుకోవాలన్న విషయాలపై అవగాహన పెంపొందించాలన్నారు. జిల్లాను మాతృమరణాలు లేని జిల్లాగా తయారు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్‌ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి లబ్ధిదారు కుటుంబానికి అంగన్వాడీ సేవలు అందాలన్నారు. ప్రతి వారం రెండు ప్రాజెక్టులను పర్యవేక్షించాలని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ శ్రీలక్ష్మి, సీడీపీఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూములపై చరిత్రాత్మక నిర్ణయం

- యాజమాన్య హక్కులతో రైతుకు న్యాయం
- సీఎం జగన్‌కు ధన్యవాదాలు
- రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో అఖిలపక్ష రైతు నేతలు



రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌ కాంగ్రెస్‌ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్‌: దశాబ్దాలుగా రైతులను వేధిస్తున్న చుక్కల భూముల సమస్యను పరిష్కరించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక, సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని పలువురు అఖిలపక్ష రైతు సంఘాల నేతలు కొనియాడారు. చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా రైతులకు న్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం వైఎస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన వైఎస్సార్‌ కాంగ్రెస్‌ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటీషు కాలంలో రీ సర్వే సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు అధికారులకు సమర్పించకపోవడం వల్ల ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కలు పెట్టారని పేర్కొన్నారు. ఇందువల్ల అవి ప్రభుత్వ భూములుగా భావిస్తూ క్రయ విక్రయాలకు అవకాశం లేకుండా చేశారన్నారు. చుక్కల భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, వివాహాలు తదితర అవసరాల కోసం వాటిని అమ్ముకోలేక పోయారన్నారు. ఒకవేళ ఎవరైనా అనధికారికంగా విక్రయించాలనుకుంటే తక్కువ ధర లభించేదన్నారు. 2016లో చంద్రబాబు ప్రభుత్వం చుక్కల భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్‌ దృష్టికి రైతులు ఈ సమస్యను తీసుకు వెళ్లారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు యాజమాన్య హక్కులు కల్పించారని తెలిపారు. ఇలా జిల్లాలో 31,399 ఎకరాలకు సమస్య తప్పిందని తెలిపారు. భూముల వివరాలను రిజిస్ట్రేషన్‌ అధికారులకు పంపి క్రయ విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారని వివరించారు. రైతుల పేరిట యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం అభినందనీయం



సుమారు వందేళ్లుగా రైతులు చుక్కల భూముల సమస్య ఎదుర్కొంటున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ ఉమ్మడి రాష్ట్రంలో మేము పలు ఆందోళనలు నిర్వహించాము. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూముల సమస్య పరిష్కరించడం అభినందనీయం. వివాదాలు ఉన్న భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిష్కరించాలి. రికార్డులు సక్రమంగా ఉంటే రైతుకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
– ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, సీపీఐ రైతు సంఘం

అధికారులు డబ్బు వసూలు చేస్తున్నారు



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో హక్కు పత్రాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు రైతుల నుంచి డబ్బులు డిమాండ్‌ చేస్తున్నారు. సాగు చేస్తున్న వారికే హక్కు పత్రాలు ఇవ్వాలి. భాగ పరిష్కారాల్లో వివాదాలు ఉంటే రెవెన్యూ అధికారులు పరిశీలించాలి. 2000వ సంవత్సరంలో చుక్కల భూములను రిజిస్ట్రేషన్‌ చేయించుకున్న రైతులు వాటిని ఇప్పుడు అమ్ముకోవాలని ప్రయత్నిస్తుండగా రిజిస్ట్రేషన్‌ అధికారులు అంగీకరించడం లేదు. వీరికి బ్యాంకు రుణాలు కూడా లభించడం లేదు. అప్పట్లో కొన్న చుక్కల భూములకు కూడా హక్కు పత్రాలు ఇవ్వాలి. – దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, సీపీఎం రైతు సంఘం

సీఎం నిర్ణయంతో రైతులకు న్యాయం



చుక్కల భూములపై ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల రైతులకు న్యాయం జరిగింది. అలాగే జిల్లాలోని ఐదు వేల ఎకరాల జెడ్‌పొహచ్‌డీసీ భూములకు కూడా పట్టాలు ఇవ్వాలి. దళిత వర్గాలకు గతంలో ఇచ్చిన భూములను వారికి తెలియకుండానే రెవెన్యూ అధికారులు రద్దుచేయడం లేదా రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదు చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలి. – పి.శివారెడ్డి, జిల్లా కన్వీనర్‌, రైతు స్వరాజ్య వేదిక

చుక్కల చిక్కులు తప్పాయి



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల ఎన్నాళ్లగానో రైతులను పీడిస్తున్న చిక్కులు తప్పాయి. ఇందుకు సీఎం అభినందనీయులు. డీకేటీ భూములు కూడా అమ్ముకోవడానికి, కొనడానికి అవకాశం కల్పించాలి. – జనార్దన్‌, జిల్లా కార్యదర్శి, భారతీయ కిసాన్‌ సంఘ్‌

యోగాసనంతో మానసిక వికాసం

ఏఆర్‌ అదనపు ఎస్పీ ఎస్‌ఎస్‌ఎస్‌వీ కృష్ణారావు



యోగా సాధన చేస్తున్న ఏఆర్‌ అదనపు ఎస్పీ ఎస్‌ఎస్‌ఎస్‌వీ కృష్ణారావు, యోగా సాధన గురువులు

కడప అర్బన్‌: యోగసాధనతో సమాజంలో ఐకమత్యం, మానసిక వికాసం, ఉత్తమ భవిష్యత్తు, సామరస్యపూర్వకమైన ప్రపంచం సాధ్యమవుతుందని ఏఆర్‌ అదనపు ఎస్పీ ఎస్‌ఎస్‌ఎస్‌వీ కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం కడపలోని జిల్లా పోలీస్‌ పెరేడ్‌ మైదానంలో ఏఆర్‌,సివిల్‌, మహిళా పోలీసులు, హోంగార్డులు యోగా సాధన చేశారు. ఆర్ట్‌ ఆఫ్‌ లివింగ్‌ యోగా గురువులు ధృవ శేషారెడ్డి, హిమబిందు, ఎస్‌ఐ శ్రీనివాసులు పోలీసులకు యోగాలో మెలకువలు నేర్పారు. ఈ సందర్భంగా ఏఆర్‌ అదనపు ఎస్పీ మాట్లాడారు. యోగా శరీరాన్ని, మెదడును, మనసును, ప్రకృతిని కలుపుతుందన్నారు. యోగా ఒత్తిడిని తగ్గిస్తుందని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని, క్రమశిక్షణ నేర్పిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతిరోజూ యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు వీరేష్‌, సోమశేఖర్‌నాయక్‌, అన్ని విభాగాల పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన శ్యామ్‌కుమార్

సిద్దవటం : కడప–చెన్నై ప్రధాన రహదారిలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కడప నగర పరిధిలోని చెలమారెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్యామ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండల శివారులోని జేఎంజే కళాశాల వద్ద బుధవారం ద్విచక్ర వాహన దారుడు కడప నుంచి భాకరాపేటకు వస్తున్నాడు. భాకరాపేట గ్రామ సమీపం లోని హెచ్‌పీసీఎల్ నుంచి ఆయిల్ ట్యాంకర్ లోడుతో నంద్యాలకు వెళుతోంది. జేఎంజే కళాశాల వద్ద ఆయిల్‌ట్యాంకర్ బైక్‌లో వెళుతున్న శ్యామ్‌కుమార్‌ను ఢీకొంది. దీంతో అతని కాలు విరిగింది. చికిత్సకోసం 108 వాహన సిబ్బంది కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శ్యామ్‌కుమార్ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు




కడప అర్బన్ : కడప లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ బుధవారం వేర్వేరుగా ఇద్దరు మహిళలు మృతి చెందారు. వారి మృతదేహాలను మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు ఉంటే తమను నేరుగా సంప్రదించాలనీ కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

యువకుడిపై ప్రియురాలి తల్లి దాడి

కురబలకోట : యువకుడిపై ప్రియురాలి తల్లి కొడవలితో దాడి చేసిన సంఘటన బుధవారం అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు కథనం మేరకు..మండలంలోని అంగళ్లు దగ్గరున్న చేనేతనగర్‌లో పి. రెడ్డి ప్రసాద్ (24) ప్రైవేటు డ్రైవర్‌గా ఉంటూ మరో వైపు డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని ఇంటి దగ్గరే మరో ముస్లిం యువతి (17) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. సంవత్సరంగా పరస్పరం ప్రేమలో పడ్డారు. ఈ విషయం ఇద్దరి ఇళ్లలో కూడా తెలుసు. ఇటీవల రెడ్డిప్రసాద్ కుటుంబీకులు ప్రియురాలి ఇంటికి వెళ్లి పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. మతం మార్చుకుంటే తమ కుమార్తె మేజర్ అయ్యాక పెళ్లి చేస్తామని ప్రియురాలి తల్లి రెహానా (45) చెప్పింది. తొలుత వారు ఒప్పుకున్నా తర్వాత మతం మారడం వద్దనుకున్నారు. దీంతో బుధవారం రెడ్డి ప్రసాద్ మరోసారి అదే వీధిలో వస్తున్న రెహానాతో పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. దీంతో వారి మధ్య వివాదం కాస్తా గొడవకు దారి తీసింది. దీంతో కోపంతో ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకుని రెడ్డి ప్రసాద్‌పై రెహెనా దాడికి పాల్పడింది. అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడ్డ రెహానాపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నీరు పుష్కలం.. పెరిగిన భూగర్భజలం

- రైతన్నకు వెన్నుదన్ను సర్వరాయసాగర్ ప్రాజెక్ట
- మూడు పంటలు పండించేందుకు అవకాశం
- 90 శాతం పనులు పూర్తి


నీటితో కళ కళలాడుతున్న సర్వరాయ సాగర్

వీరపునాయునిపల్లె : కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలలు కన్నారు.జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంకల్పించారు. ఫలాలు అందుతాయని ఆశించిన తరుణంలో ఆయన ఆకస్మిక మరణం అశనిపాతంలా మారింది. తండ్రి స్వప్నం సాకారం చేసేందుకు తనయుడు సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు.రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వీరపనాయునిపల్లె మండలంలోని సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులను 90శాతం పూర్తి చేశారు. కేవలం రివిట్‌మెంటు పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 3.06 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1 టీఎంసీ నీటిని ప్రాజెక్టులో నిల్వ ఉంచుతున్నారు. మిగిలిన 10శాతం పూర్తయితే 100 శాతం నీటిని నిల్వ ఉంచేందుకు వీలుంటుంది. ప్రాజెక్టులో నాలుగు సంవత్సరాలుగా నీటిని నిలువ ఉంచుతుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోరు బావుల్లో నీరు అధికమవడంతో రైతులు పంటలు సాగుకు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో వర్షాధార పంటల సాగు చేసే రైతులు ప్రస్తుతం బోర్లు వేసి రెండు లేదా మూడు పంటలు పండిస్తుండటం విశేషం. నీరు పుష్కలంగా ఉండటంతో మండలంలోని అన్ని గ్రామాల్లో తోటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో చీనీ నిమ్మ సాగు చేసిన రైతులు ట్రాక్టర్లతో నీటిని సరఫరా చేసి పంటలను కాపాడుకొనేవారు. ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉండటంతో అటువంటి పరిస్థితి లేదు.

మరో కోనసీమగా మారనున్న వీరపునాయునిపల్లె

వీరపునాయునిపల్లె మండలం మరో కోనసీమను తలపించనుంది. ఎంతో కాలంగా ముళ్ల పొదలతో నిండి పోయి నిరుపయోగంగా ఉన్న భూములు ప్రస్తుతం సాగులోకి వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం సర్వరాయ సాగర్ ప్రాజెక్టు. ఏ గ్రామంలో చూసినా ఇప్పటికే అరటి, చీనీ నిమ్మ, సన్న నిమ్మ, బొప్పాయి, మామిడి పంట పొలాలతో పచ్చగా దర్శనమిస్తున్నాయి. పంట కాలువలు పూర్తయితే పచ్చదనానికి మారు పేరుగా వీరపునాయునిపల్లె మండలం నిలవనుంది,

ఆయకట్టు పెరుగుతుంది

సర్వరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కుడి,ఎడమ కాలువల ద్వారా 25వేల ఎకరాలకు సాగు నీరు అందించేందు వీలుంటుందని అధికారులు అంచనా వేశారు. కానీ నులు పూర్తిస్థాయిలో పూర్తయిన తరువాత ఆయకట్టు మరింత పెరిగేందుకు వీలుంటుంది.

నాలుగు సంవత్సరాలుగా కుడి కాలువ ద్వారా పొలాలలకు నీరు అందిస్తున్నారు. కాలువకు ఇరువైపులా పొలాలు ఉన్న రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. సంగాలపల్లె, ఇందుకూరు, గంగిరెడ్డిపల్లె, అనిమెల గ్రామాలకు చెందిన కొంత మంది రైతులకు ప్రస్తుతం కుడి కాలువ వెన్ను దన్నుగా నిలుస్తోంది.

పంట కాలువలను త్వరలో పూర్తి చేస్తాం



ప్రధాన కాలువలకు సంబంధించిన పనులు, పంట కాలువల పనులు త్వరలో పూర్తి చేస్తాం. పంటల కాలువలకు కాలువలకు సంబంధించి భూ సేకరణ దాదాపు పూర్తయింది. 2024లో పంట కాలువలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తాం. ఎడమ కాలువ 9.35కిలో మీటర్లకు గాను 8కిలో మీటర్లు, కుడి కాలువ 16.65కిలోమీటర్లకు గాను 9కిలో మీటర్లు పూర్తి చేశాం.

– సాయిరామ్ ప్రసాద్, (సర్వరాయ సాగర్ ప్రాజెక్టు ఈఈ

రైతులకు దన్నుగా నిలుస్తున్న సర్వరాయ సాగర్



సర్వరాయసాగర్ ప్రాజెక్టు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. గతంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఎన్ని బోర్లు వేసినా నీరు ఉండేది కాదు. ప్రస్తుతం ఎక్కడ బోరు వేసినా నీరు పుష్కలంగా వస్తున్నాయి. నేడు రెండు పంటలు పండించుకుంటున్నాం. ఇదంతా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువ. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి.

– శ్రీనివాసులురెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లె

రెండోరోజు జిల్లాలో వర్షం

జిల్లాలో అత్యధికంగా 40 మి.మీ.వర్షపాతం నమోదు

కడప అగ్రికల్చర్: రుతు పవనాల ఆగమనంతో రెండవ రోజు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. దీంతో కొద్దికొద్దిగా వాతావరణం చల్లబడుతోంది. బుధవారం తెల్లవారుజామున వేముల మండలంలో అత్యధికంగా 40 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సీకే దిన్నె, ఖాజీపేట, పోరుమామిళ్ల మండలాల్లో అత్యల్పంగా 2.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

జిల్లాలో కురిసిన వర్షం వివరాలు ఇలా..

మండలం	నమోదైన వర్షం (మిల్లీమీటర్లలో)	మండలం	నమోదైన వర్షం (మిల్లీమీటర్లలో)
మైదుకూరు	35.6	రాజుపాలెం	10.2
కలసపాడు	35.4	తొండూరు	9.6
కాశినాయన	29.2	బి.మఠం	8.8
వేంపల్లి	27.6,	చక్రాయపేట	7.0
కొండాపురం	14.4	సిద్దవటం	5.2
బద్వేల్	13.6	సింహాద్రిపురం	4.4
మైలవరం	13	చెన్నూరు	3.2
పులివెందుల	12	గోపవరం	2.4

పెన్నా బ్రిడ్జి భూ సేకరణ ప్రక్రియను పరిశీలించిన జేసీ


భూ సేకరణ గురించి ఆర్డీఓ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరం వద్ద పెన్నానదిపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. రూ.53 కోట్లతో బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా 2.59 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి 45 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో భాగంగా జాయింట్ కలెక్టర్ ఆర్డీఓ శ్రీనివాసులుతో కలసి భూ సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ఎంత మంది పట్టాదారులు భూములు కోల్పోతున్నారు, పరిహారం ఏమేరకు ఇవ్వాల్సి ఉంటుందనే విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

24 నుంచి సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్సార్ సర్కిల్ : ఈనెల 24,25,26 తేదీల్లో జిల్లాలోని వీరపునాయునిపల్లెలో సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం కడపలోని హోచిమన్ భవన్‌లో మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సంగ్రామంలో సీపీఐ అగ్ర భాగాన నిలిచి పోరాటాలు చేసిందన్నారు. స్వాతంత్య్రం అనంతరం రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, భూ సంస్కరణల చట్టం అమలు కోసం పట్టుబట్టి సాధించి ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పేందుకు పోరాటాలు చేసినట్లు చెప్పారు.దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను విస్మరించి నిరంకుశ పాలన చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తదితర అంశాల గురించి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజనేయులు, వెంకటశివ, కేసీ బాదుల్లా, విజయలోక్ష్మ తదితతరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ


కె.హర్షిత్


టీపీ.రాజ్‌ప్రియన్


జె.శశాంక్


బి.చందుప్రజ్వల్


జె.కార్తిక


పి.జ్ఞానేంద్రరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో 2023–2024 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి, ఈ ఫలితాల్లో కే.హర్షిత్, వి.చందు ప్రజ్వల్, జీ.కార్తీక, బి.హేమంత్ కుమార్, పీ.జ్ఞానేంద్ర రెడ్డి, ఎం.తీర్థ, టి.పీ.రాజ్ ప్రియన్, జే.శశాంక్, ప్రణీత్‌తో పాటు మొత్తం 42 మంది తమ విద్యార్థులు సీట్లు సాధించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీలు అభినందించారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి


వ్యక్తిత్వ వికాస పుస్తకాలను కేడెట్స్‌కు అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా

కడప స్పోర్ట్స్ : విద్యార్థులు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంపొందిచుకోవాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా సూచించారు. కడప నగరం తెలుగుగంగ కాలనీలో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రెనింగ్ క్యాంపులో బుధవారం స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–కెరీర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, దిశాయాప్, మహిళల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్స్‌కు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ, పోటీపరీక్షల నిపుణుడు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా శ్రమించాలన్నారు. సాంకేతికతను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే సగం విజయం సాధించినట్లేనన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ పదోతరగతి తర్వాత విద్యార్థులకు ఉన్న విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన మరో సదస్సులో కడప పట్టణ క్రైమ్ సీఐ శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ సైబర్ నేరాలపై కేడెట్స్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మధుమల్లేష్‌రెడ్డి, లక్ష్మిదేవి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, వి.వి. నారాయణ, నాగశ్రీను, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్స్ పాల్గొన్నారు.

పెప్సీగోడౌన్‌పై ఆకతాయిల దాడి

వాహనాలు, గోడలు, ఫర్నీచర్ ధ్వంసం


విచారణ చేస్తున్న చిన్నచౌక్ పోలీసులు

కడప అర్బన్ : కడపలోని కొండాయపల్లె సమీపంలో ఉన్న పెప్సీగోడౌన్‌పై ఈనెల 19వ తేదీ సాయంత్రం కొందరు ఆకతాయిలు ద్విచక్రవాహనాలపై కర్రలతో వెళ్లి దాడి చేశారు. ఈ దాడిలో కారు, ఇతర వాహనాల అద్దాలను పగులగొట్టారు. ఈ సంఘటనలో ఓ టీవీ ఛానెల్ టౌన్ విలేకరి (సాక్షి టీవీ కాదు) కీలకపాత్రను పోషించాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం, పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాయపల్లె సమీపంలో 84 సెంట్ల విస్తీర్ణంలో పెప్సీ గోడౌన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గోడౌన్‌కు సంబంధించిన స్థిరాస్తి వ్యవహారంపై రామయ్య నాయుడు, వెంకటేశ్వర్ నాయుడు అనే రెండు కుటుంబాల మధ్య కోర్టులో నడుస్తోంది. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. గోడౌన్ నిర్వాహకుడు చెన్నూరుకు చెందిన గోగుల కృష్ణయ్య బాడుగను ఈ స్థిరాస్తి వివాదంలోని ఒకవైపు ఉన్న రామయ్యనాయుడుకు చెల్లిస్తున్నాడు. వెంకటేశ్వర్ నాయుడు తరపున ఓ టీవీ ఛానెల్‌కు చెందిన కడప టౌన్ విలేకరి కొంతమంది యువకులను కూడగట్టుకుని, గోడౌన్‌పైకి దాడికి పంపించాడు. దాదాపు 20 నుంచి 30 మంది సంఘటన స్థలానికి చేరుకుని అక్కడ కారు అద్దాలను, ఇతర వాహనాలను ధ్వంసం చేశారు. పెప్సీ గోడౌన్‌లోని కూల్‌డ్రింక్ సీసాలను పగులగొట్టారు. గోడౌన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపు కొందరు పరారయ్యారు. తరువాత బాధితులు నేరుగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ ప్రత్యేకంగా విచారించి దర్యాప్తు చేపట్టాలనీ కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్‌ను ఆదేశించారు. 16 మంది మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ డీఎస్పీ తెలియజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీ : వ్యక్తి మృతి


వెంకటరమణ (ఫైల్)

గుర్రంకొండ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ మొటుకు క్రాస్ వద్ద జరిగింది. పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెకు చెందిన కంబాల వెంకటరమణ(65) మంగళవారం పని నిమిత్తం గుర్రంకొండకు వచ్చాడు. తిరిగి బస్సులో స్వగ్రామానికి బయలు దేరాడు. మొటుకు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం వెంకటరమణను ఢీకొంది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతుకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళా రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన అన్నమయ్య మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన నారాయణ భార్య హేమావతి పశుగ్రాసం తెచ్చేందుకు పొలం వద్దకు వెళ్లింది. పశువుల గడ్డి కోస్తుండగా ఆకస్మాత్తుగా పాము కాటేసింది. దీంతో ఆమె అస్వస్థతకు గురికాగా గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు తిరుపతికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన అన్నమయ్య మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. వేంపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన మురళి భార్య చందన(28) కుటుంబ సమస్యల కారణంగా భర్తపై అలిగి మనస్థాపంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

ఆ పంతులమ్మ మా కొద్దు

– పాఠశాలకు తాళం వేసి నిరసన

కలకడ : చిన్నారులను కొట్టి హింసించే ఉపాధ్యాయురాలు మాకు వద్దంటూ అన్నమయ్య జిల్లా కలకడ మండలం, ముడియంవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సర్పంచ్ బుధవారం పాఠశాల గేట్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనంమేరకు వివరాలిలాఉన్నాయి. మండలంలోని ముడియంవారిపల్లె ప్రభుత్వ ప్రాథిమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగలక్ష్మమ్మ విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించడంతో నాలుగు నెలల క్రితం సర్పంచ్ శాంతమ్మ, పాఠశాల విద్యాకమిటీ ఫిర్యాదు మేరకు పూర్వ జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ జరిపారు. వాస్తవాలు తెలియడంతో నాలుగు నెలలపాటు సస్పెండ్‌చేశారు అనంతరం డిప్యూటేషన్‌పై కేవీపల్లె మండలానికి కేటాయించారు. డిప్యూటేషన్ గడువు పూర్తి కావడంతో తిరిగి ముడియంవారిపల్లె పాఠశాలలో విధులకు హాజరైన ఉపాధ్యాయురాలు నాగలక్ష్మమ్మను మా పాఠశాలకు రావద్దు అంటూ బుధవారం పంచాయతీ సర్పంచ్ శాంతమ్మ, పాఠశాల విద్యాకమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి పాఠశాలకు తాళంవేసి నిరసన తెలిపారు. అక్కడికి చేరుకున్న మండలవిద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతానని హామీ ఇచ్చినా విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేదు. దీనిపై ఎంఈఓ వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కరిస్తామని, విద్యార్థులకు న్యాయం చేస్తామని తెలిపారు.

బైక్‌లు ఢీ : డిగ్రీ విద్యార్థి దుర్మరణం



సంఘటన స్థలంలో ద్విచక్రవాహనాలు (ఇన్‌సెట్) వెంకటసాయి మృతదేహం

కడప అర్బన్ : కడప బాలాజీనగర్‌లోని ఎస్వీడీసీ కళాశాలకు వెళుతున్న రహదారిలో మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బత్తిన వెంకటసాయి (20) అనే డిగ్రీ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో యువకుడు తేజ స్వల్పంగా గాయపడ్డాడు. కడప తాలూకా ఎస్ఐ రామకృష్ణ, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఊటుకూరులో నివాసం ఉంటూ, ఆర్టీసి డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య, రమాదేవిలకు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, తరువాత వెంకటసాయి కుమారుడు ఉన్నారు. ఇతను కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈనెల 20వ తేదీ రాత్రి స్నేహితుడు తేజతో కలిసి వైవీ స్ట్రీట్‌కు స్కూటీలో వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఎదురుగా వేగంగా ద్విచక్రవాహనంపై వచ్చి వీరిని ఢీకొంది. వెంటనే స్థానికులు గుర్తించి 108కు ఫోన్ చేశారు. 108లో రిమ్స్‌కు చేరుకోగానే కొంతసేపటికి వెంకటసాయి మృతి చెందాడు.తేజకు స్వల్పగాయాలయ్యాయి. మరో బైక్‌లోని వారు రిమ్స్‌లో ప్రాథమిక చికిత్స చేయించుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

గాలివానకు దెబ్బతిన్న పంటలు


వి.కొత్తపల్లెలో గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు


వేంపల్లె: అరటి పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ

వేముల : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలపాటు గాలివాన బీభత్సం సృష్టించింది. గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. మండల వ్యాప్తంగా పత్తిపంట దెబ్బతింది. మండలంలో 4వేల ఎకరాల్లో వేసవి పంటగా రైతులు పత్తి సాగు చేశారు. గాలివానతో కాయలతో ఉన్న పత్తి పంట బలమైన గాలులకు నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్థంభాలు, నేలకూలడంతో రాత్రి నుంచి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వి.కొత్తపల్లె గ్రామానికి చెందిన రెడ్డమ్మ నివాసం ఉంటున్న ఇంటి పైకప్పు రేకులు లేచిపోయింది. మండల వ్యాప్తంగా 4సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అరటి పంట నేలమట్టం

వేంపల్లె : మండలంలోని బక్కన్నగారిపల్లె, గిడ్డంగివారిపల్లె, టి.వెలమవారిపల్లె గ్రామాల్లో సుమారు 220హెక్టార్లలో అరటి పంట దెబ్బతిందని హెచ్ఓ రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలుల వర్షానికి 185మంది రైతుల అరటి పంట నేలవాలింది. దీంతో దాదాపు రూ.5కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ఎకరాకు రూ.80వేల నుంచి లక్ష రూపాయలు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకుని నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బక్కన్నగారిపల్లె సర్పంచ్ మలయ్య, రైతులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.